# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 03-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ బుద్ధుని బోధనలు మానవాళికంతటికీ ఆదర్శమని, ఆ కాలాతీత సంప్రదాయానికి భారత్ ఒక సజీవ వాహిక అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.

- ❖ అండమాన్ నికోబార్ దీవుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు.

- ❖ సెల్‌ఫోన్ల కోసం విదేశాల వైపు చూసిన భారత్.. నేడు ప్రపంచ దేశాలకే టెలికాం పరికరాలను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.

- ❖ ఢిల్లీ, హరియాణా, పంజాబ్, చండీగఢ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ నెల 9వ తేదీ వరకు అత్యంత దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది.

==============================

ఆరోగ్యవంతమైన జీవనానికి ప్రాచీన సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక శాస్త్రంతో అనుసంధానించడం ఎంతో అవసరమని భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఉద్ఘాటించారు. చెన్నైలో ఈరోజు నిర్వహించిన `జాతీయ సిద్ధ వైద్య దినోత్సవం`లో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ... సిద్ధ వైద్యం అనేది గతానికి సంబంధించిన జ్ఞాపకం మాత్రమే కాదని, అది నేటికీ సజీవంగా ఉన్న అద్భుత సంప్రదాయమని కొనియాడారు. సిద్ధ, ఆయుర్వేద, యునాని, యోగా వంటి చికిత్సా విధానాలు కాలపరీక్షకు నిలబడ్డాయని, నేటికీ కోట్లాది మంది ప్రజల ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో వస్తున్న కొత్త తరహా వ్యాధులకు భారతీయ వైద్యంలో పరిష్కారాలు ఉన్నాయని స్పష్టం చేశారు.

==============================

బుద్ధుని బోధనలు మానవాళికంతటికీ ఆదర్శమని, ఆ కాలాతీత సంప్రదాయానికి భారత్ ఒక సజీవ వాహిక అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఢిల్లీలోని రాయ్ పిథోరా సాంస్కృతిక సముదాయంలో భగవాన్ బుద్ధుని పవిత్ర పిప్రావా అవశేషాల అంతర్జాతీయ ప్రదర్శన `ది లైట్ అండ్ ది లోటస్`ను ప్రధాని ప్రారంభించారు. ఈ

సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో నరేంద్ర మోదీ మాట్లాడుతూ... 125 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ ముగిసిందని.. మన అపురూప సాంస్కృతిక వారసత్వం మళ్లీ స్వదేశానికి చేరిందని ఆనందం వ్యక్తం చేశారు. బుద్ధుని ఈ పవిత్ర ధాతువులను విదేశాలకు తీసుకెళ్లిన వారు గతంలో వాటిని అంతర్జాతీయ మార్కెట్ లో వేలం వేయడానికి ప్రయత్నించారని, అయితే భారత్‌కు అవి కేవలం వస్తువులు కాదని, భగవంతుని స్వరూపమని ప్రధాని పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వం పట్టుబట్టి ఆ వేలాన్ని నిలిపివేసి, వాటిని తిరిగి రప్పించిందని నరేంద్రమోదీ వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ.. ఈ పవిత్ర రత్న ధాతువులన్నీ ఒకే చోట చేరడం దేశానికే గర్వకారణమని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అండమాన్ నికోబార్ దీవుల సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. అండమాన్ నికోబార్ దీవులలోని శ్రీ విజయపురంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో ఆయన మొత్తం 373 కోట్ల రూపాయల విలువైన 11 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఇందులో 229 కోట్ల రూపాయలతో నిర్మించిన `ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్` (ICCC) సహా మరో 8 ప్రాజెక్టులను ప్రారంభించగా, మరో రెండు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ.. చిన్న చిన్న ద్వీపాల్లో సైతం పర్యాటకాన్ని ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాల కల్పన, భద్రతను పటిష్టం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఎన్నికల ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ.. కేంద్ర ఎన్నికల సంఘం (ECI) `ECI Net` యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. గతంలో ఉన్న 40 రకాల వివిధ యాప్‌లను ఒకే గొడుగు కిందికి తెస్తూ.. ఈ సమగ్ర యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌ను మరింత యూజర్ ఫ్రెండ్లీగా తీర్చిదిద్దేందుకు పౌరుల నుంచి సలహాలను ఆహ్వానిస్తున్నట్లు కమిషన్ వెల్లడించింది. యాప్‌లోని `Submit a Suggestion` ట్యాబ్‌ను ఉపయోగించి పౌరులు తమ అభిప్రాయాలు, సూచనలను తెలియజేయవచ్చు. ఈ నెల 10వ తేదీ వరకు ఈ అవకాశం అందుబాటులో ఉంటుందని ఈసీ పేర్కొంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన మహనీయుల సేవలను స్మరించుకోవడం ఎంతో ముఖ్యమని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఢిల్లీలోని శాసనసభలో భారతరత్న అటల్ బిహారీ వాజపేయి, పండిట్ మదన్ మోహన్ మాలవ్య చిత్రపటాలను కేంద్రమంత్రి ఈ రోజు ఆవిష్కరించారు. జాతీయ గేయం 'వందేమాతరం' రచనకు 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన 'భారత్ మాత' పేరుతో కాఫీ టేబుల్ పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అటల్ బిహారీ వాజ్‌పేయీ, పండిట్ మదన్ మోహన్ మాలవ్య చిత్రపటాలను ఆవిష్కరించడం కేవలం వారిని గౌరవించుకోవడమే కాకుండా.. దేశ పార్లమెంటరీ విలువలను, నైతిక రాజకీయ ఒరవడిని, జాతీయ స్ఫూర్తిని గౌరవించుకోవడమే అవుతుందని కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఒకప్పుడు సెల్‌ఫోన్ కావాలంటే విదేశాల వైపు చూసిన భారత్.. నేడు ప్రపంచ దేశాలకే టెలికాం పరికరాలను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో అటల్ బిహారీ వాజ్‌పేయి, శ్రీకాంత్ శంకర్ జోషీల స్మృత్యర్థం ఈ రోజు నిర్వహించిన `పంచ్ పరివర్తన్` కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత్ సాంకేతిక రంగంలో విశేష పురోగతి సాధించిందని.. 4జీ, 5జీ నెట్‌వర్కులు, సెమీకండక్టర్ చిప్స్, టెలికాం పరికరాల తయారీలో ప్రధానంగా ముందడుగు వేసిందని అన్నారు. భారత యువశక్తి, సాంకేతిక పరిజ్ఞానం కలగలిస్తే ప్రపంచ వేదికపై తిరుగులేని శక్తిగా ఎదగడం ఖాయమని అశ్విని వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నిషేధిత సీపీఐ మావోయిస్టుల పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (PLGA) బెటాలియన్ కమాండర్ బడ్సే సుక్కా అలియాస్ దేవా, తెలంగాణ కమిటీ సభ్యుడు కన్కనాల రాజి రెడ్డి సహా 20 మంది మావోయిస్టులు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట ఈరోజు లొంగిపోయారు. 48 ఆయుధాలు, 20 లక్షల 30 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. పునరావాస ప్యాకేజీలో భాగంగా పోలీసు శాఖ మొత్తం కోటి 81 లక్షల 90 వేల రూపాయల రివార్డ్‌ను ప్రకటించింది. తక్షణ సహాయంగా లొంగిపోయిన ప్రతి ఒక్కరికి 25 వేల రూపాయల చొప్పున అందజేసింది.

మరో వైపు ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజన్‌లో ఈరోజు భద్రతా దళాలు జరిపిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మొత్తం 14 మంది మావోయిస్టులు హతమయ్యారు. బస్తర్ డివిజన్ పరిధిలోని సుక్మా జిల్లా కొంటా అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు గాలింపు చేపడుతుండగా మావోయిస్టులు ఎదురుపడ్డారు. ఇరుపక్షాల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో 12 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు బీజాపూర్ జిల్లా బాసగూడ ప్రాంతంలో జరిగిన రెండో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారు. చనిపోయిన వారంతా కీలక నేతలుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ రాజధాని ఢిల్లీతో పాటు హరియాణా, పంజాబ్, చండీగఢ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ నెల 9వ తేదీ వరకు అత్యంత దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది. ఈ మేరకు 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. మరోవైపు హిమాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్రమైన చలి గాలులు వీస్తాయని, ఉత్తరాఖండ్‌లో మంచు గడ్డకట్టే పరిస్థితులు నెలకొంటాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. బీహార్‌లో సైతం సోమవారం వరకు శీతల పవనాల ప్రభావం కొనసాగుతుందని వెల్లడించింది. దట్టమైన పొగమంచు కారణంగా ఢిల్లీ సహా ఎన్‌సీఆర్ పరిధిలో దృశ్య గోచరత కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూజిలాండ్‌తో ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టును బీసీసీఐ (BCCI) ఈరోజు ప్రకటించింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌కు సెలక్టర్లు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించగా, శ్రేయస్ అయ్యర్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. గతేడాది ఆస్ట్రేలియా పర్యటనలో గాయానికి గురై జట్టుకు దూరమైన అయ్యర్.. ఈ సిరీస్‌తో మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టబోతున్నాడు. ఈ జట్టులో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు చోటు కల్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోనే మొట్ట మొదటి `వందే భారత్ స్లీపర్` రైలును రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ న్యూ ఢిల్లీలో ఈరోజు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఈ నెలలోనే  గువహటి - కోల్‌కతా మధ్య ఈ తొలి సర్వీసును ప్రారంభించనున్నట్లు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =